సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం ၊ 30 ၊ మే ၊ 2025



గంజాయి సాగు.. నలుగురి అరెస్ట్
పంట పొలాల్లో గంజాయి సాగుచేస్తున్న నలుగురు వ్యక్తులను నల్లగొండ జిల్లా గుడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఉపాధి పనుల్లో విద్యావంతులు
ఉన్నత విద్యావంతులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు సైతం పలుగు, పార పట్టి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. - 8లో



వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

సాక్షి యాదాద్రి : సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. జూన్ 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం ఆయన కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏచిన్న సమస్య తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో పోలీస్, రెవెన్యూ, డీఆర్‌డీఓ, పంచాయతీరాజ్, రవాణా, విద్యుత్, వైద్య, ట్రాఫిక్, మిషన్ భగీరథ, సివిల్ సప్లయ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు


మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

భువనగిరి : లింగ నిర్ధారణకు పాల్పడితే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్ఓ మనోహర్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 57 స్కానింగ్ సెంటర్ల అనుమతులు ఉండగా ప్రస్తుతం 41 పని చేస్తున్నాయని తెలిపారు. మార్చిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 41 స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. లింగ నిష్పత్తిని తగ్గించేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహించి పీసీ, పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ కమిటీ సభ్యులు డాక్టర్ యశోద, డాక్టర్ మాలతి, కవిత, అరుంధతి, జిల్లా ప్రజా సంబంధాల అధికారి సౌజన్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రమీళ, సార్స్ ఎన్జీఓ ప్రతినిధి శివలింగం, నాగరాజు, అంజయ్య, వసంతికుమారి పాల్గొన్నారు.

నేషనల్ ఇన్నోవేటివ్ అవార్డుకు ఎంపిక


కుక్కడపు రమేష్

రామన్నపేట: మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుక్కడపు రమేష్ నేషనల్ ఇన్నోవేటివ్ శిక్షారత్న అవార్డుకు ఎంపికయ్యాడు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఏర్పడిన ఈ సంస్థ వినూత్న పద్ధతులతో బోధన చేసిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఏటా అవార్డులు ప్రదానం చేస్తుంది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇందులో కుక్కడపు రమేష్ కూడా ఉన్నారు. రమేష్ వలిగొండ మండలం పహిల్వాన్‌పురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించిన డీఎంఈఏ


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంఈఏ శివరాంప్రసాద్

భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిని గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అకాడమీ(డీఎంఈఏ) డాక్టర్ శివరాంప్రసాద్ సందర్శించారు. ఓపీ విభాగాలు, క్యాజువాలిటీ విభాగం, వార్డులు, మార్చురీ గదితో పాటు ఆస్పత్రి పై భాగంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందజేస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణం కోసం ఇంకా స్థలం కేటాయింపు జరగలేదన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు ఉన్నారు.

మీజిల్స్ వైరల్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడాలి

మోటకొండూర్: మీజిల్స్ వైరల్ జబ్బు వ్యాప్తి చెందకుండా వెంటనే గుర్తించి అరికట్టాలని డబ్ల్యూహెచ్ఓ సర్వేలైన్ మెడికల్ అధికారి హజహర్ సూచించారు. గురువారం మోటకొండూరులోని పీహెచ్‌సీని సందర్శించి మీజిల్స్ వ్యాధిపై ఆరా తీశారు. మీజిల్స్ వైరస్ సోకిన వారికి అధిక జ్వరం, దగ్గు, జలుబు, నోరులో చిన్నచిన్న తెల్లమచ్చలు వస్తాయన్నారు.

ఇంటి దొంగల పనేనా!

గుట్ట క్షేత్రంలో చింతపండు చోరీపై అనుమానాలు

- సీసీ కెమెరాలు, పోలీస్, ఎస్‌పీఎఫ్ భద్రత ఉన్నప్పటికీ చింతపండు అపహరణ
- మంటగలిసిన ఆలయ ప్రతిష్ట
- గతంలోనూ పలు చోరీలు వెలుగులోకి
- ఆలయ భద్రతపై ఆందోళన



సాక్షి, యాదాద్రి: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో ఇంటి దొంగల చేతివాటం పెరిగిపోతోంది. ఆధ్యాత్మికతకు నెలవైన ఈ ఈ ఆలయంలో చింతపండు చోరీ జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్, ఎస్‌పీఎఫ్ భద్రత ఉన్నప్పటికీ చోరీ జరగడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పూర్తిస్థాయి ఈఓ లేకపోవడం, ఆలయ ఉద్యోగుల్లో కొందరి హస్తం వల్లే ఈ ఘటన జరిగిందన్న వాదన ఉంది. దేవస్థానంలో ఇటువంటి ఘటనలు ఎన్ని జరుగుతున్నాయోనన్న అనుమానం భక్తుల్లో నెలకొంది.

9 బస్తాల చింత పండు చోరీ

కొండపైన చింతపండు దొంగతనం చేస్తూ ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పట్టుబడ్డారు. మంగళవారం అర్ధరాత్రి యాదగిరిగుట్టపైన గల ప్రసాదాల తయారీ కేంద్రం విభాగానికి సంబంధించిన గోదాం నుంచి ఇద్దరు వ్యక్తులు 9 బస్తాల చింతపండు (సుమారు మూడు క్వింటాళ్లు), దొంగిలించి గోదాంలో ఉన్న కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తీసుకువచ్చారు. చింతపండు బస్తాలను వారు కొండపైకి తీసుకొచ్చిన ఏపీ 9డబ్ల్యూ3254 కారులో కిందికి తరలించే క్రమంలో పట్టుబడ్డారు.

పలు విభాగాల్లో సామగ్రి మాయం!

శ్రీస్వామి వారి సన్నిధిలో పలు విభాగాల్లో చాటుమాటుగా చింతపండు లాంటి పలు దొంగతనాలు జరుగుతున్నాయన్న ప్రచారం తెరపైకి వచ్చింది. ప్రసాదాల తయారీ కేంద్రంలో లడ్డూ, పులిహోర, వడ తయారీకి విలువైన దినుసులు ఉంటాయి. ప్రసాదాల తయారీ, విక్రయాల వెనుక పలుమార్లు స్కాంలు వెలుగు చూడగా ఉన్నతస్థాయిలో విచారణ జరిగింది. ఆలయ గోదాంలకు వచ్చిన పదార్థాలు లూటీ చేస్తున్నారని విశ్వసనీయం సమాచారం. ప్రసాదం తయారీలో వాడే దినుసులు బాదం, కాజు, కిస్‌మిస్, నెయ్యి, వంటి అత్యంత ఖరీదైన పదార్థాలను యథేచ్ఛగా తరలిస్తున్నారు. సత్యనారాయణ వ్రత మండపం, అన్నదాన సత్రాలకు సంబంధించిన సరుకులు, వంట నూనె ఇతర సామగ్రి కూడా మాయం అవుతుందని సమాచారం

పనిచేయని సీసీ కెమెరాలు

సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఆలయం ఉంటుంది. ఇటీవలనే ఆలయ గోపురానికి కోట్ల రూపాయలతో స్వర్ణతాపడం చేయించారు. ఎంతో విలువైన సంపదతో పాటు, నిత్యం వేలాది మంది భక్తులు వచ్చిపోతుంటారు. నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. సివిల్ పోలీస్‌లు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది సైతం భద్రతను పర్యవేక్షిస్తుంటారు. అయినా చింతపండు చోరీ జరగడం ఆలయ భద్రతను ప్రశ్నిస్తోంది. ఈఓ కార్యాలయానికి అనుసంధానం చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదా, ఉద్దేశపూర్వకంగానే పని చేయకుండా చేశారా? అన్న కోణంలో చర్చ జరుగుతోంది. కొండపైన ఏసీపీ స్థాయి అధికారి ఉన్నా పూర్తిస్థాయిలో పోలీస్ సిబ్బందిని నియమించలేదు.

షోకాజ్ నోటీసులతోనే సరిపెట్టారు

చింతపండు కేసులో ప్రసాద విక్రయశాల విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బంది గణేష్, పులిహోర మిషన్ ఆపరేటర్ మధును స్థానిక పోలీస్‌లకు అప్పగించారు. కాగా విధుల పట్ల నిర్లక్ష్యం వహించారంటూ ప్రసాదాల తయారీ గుమస్తా పులెపాక నవీన్, పర్యవేక్షకుడు సత్యనారాయణకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వదిలేయడం అనుమానాలకు తావిస్తోంది.

అంతా ఉద్యోగుల చేతుల్లోనే..

గుట్టకు పాలకమండలి నియామకం కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఐఏఎస్ అధికారి వెంకట్రావ్‌ను ఇంచార్జ్ ఈఓగా నియమించింది. పూర్తిస్థాయి ఈఓ కాకపోవడం, ఇతర ప్రభుత్వ పనుల్లో ఉండడంతో అడపాదడపా వచ్చిపోతున్నారు. ఆలయంపై ఇంకా పూర్తిస్థాయి పట్టు సాధించలేకపోయారు. దీంతో ఉద్యోగులే ఆలయ పాలనా వ్యవహారాలు చక్కబెడుతున్నారు.

ప్రత్యేక కమిటీతో విచారణ : ఈఓ



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చింతపండు చోరీ ఘటనపై విచారణకు డిప్యూటీ ఈఓ (డీఈఓ) తో పాటు మరో ఐదుగురు సభ్యులతో కమిటీ వేయనున్నట్లు ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలయ భద్రత విషయంలో పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులను పెంచుతామన్నారు. చింతపండు చోరీకి పాల్పడిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది గణేష్, మధును పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే ప్రసాదం తయారీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. గతంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయా, ఇప్పుడే జరిగిందా.. అనే అంశంపైనా సమగ్ర విచారణ చేయిస్తామని ఈఓ వెల్లడించారు. సుదీర్ఘకాలంగా ఒకే సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు.

ఈఓ దృష్టికి ఆలయంలోని పరిణామాలు
ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఈఓ వెంకట్రావ్ గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో కలిశారు. ఆలయంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.


యాదగిరిగుట్ట ఆలయ ముఖమండపంలో స్వామివారికి పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు.వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం సేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఆ తరువాత గజవాహన సేవ, స్వామి, అమ్మవారి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ అష్టోత్తర తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

వంద రోజుల్లో సమస్యల పరిష్కారం

మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యాచరణ

- రోజువారీగా కార్యక్రమాలు
- జూన్ 2వ తేదీ నుంచి అమలు
- సమస్యలు గుర్తించే పనిలో యంత్రాంగం

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల అభివృద్ధిపై యంత్రాంగం దృష్టి సారించింది. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ రూపొందిస్తోంది. ముఖ్యంగా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, స్వచ్ఛతపై ఇంటింటి ప్రచారం, పార్కులను అభివృద్ధి చేయటం, శిథిల భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ, వైద్యశిబిరాల నిర్వహణ తదితర సమస్యలపై అధికారులు ఫోకస్ పెట్టారు. గుర్తించిన సమస్యలను రోజు వారీ కార్యక్రమాల ద్వారా వంద రోజుల్లో పరిష్కరించనున్నారు. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు ఉండగా అన్ని చోట్ల జూన్ 2నుంచి కార్యాచరణ అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్ర మాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములు చేయనున్నారు.

మున్సిపాలిటీ	వార్డులు
భువనగిరి	35
మోత్కూర్	12
ఆలేరు	12
పోచంపల్లి	13
చౌటుప్పల్	20
యాదగిరిగుట్ట	12

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- వరద కాల్వల్లో పూడికతీత
- మొక్కలు నాటడానికి స్థలాల గుర్తించడం
- మొక్కల సేకరణ, నర్సరీలో నిల్వలపై పరిశీలన
- భువన్ సర్వేకోసం వార్డులవారీగా అధికారుల నియామకం
- ఆస్తిపన్ను సమాచారాన్ని వేరు చేయడం
- మంచినీటి కుళాయి కనెక్షన్ల నవీకరణ
- ఆస్తుల మార్పిడికి సంబంధించిన ధ్రువపత్రాల సేకరణ
- వైద్యారోగ్య శిబిరాల నిర్వహణకు వైద్యులతో సంప్రదింపులు



యాక్షన్ ప్లాన్ పోస్టర్

- టెండర్లు పిలిచి పార్కులను మరింత అభివృద్ధి చేయటం
- విభాగాలకు అప్పగించిన పనులకు సంబంధించి ఉద్యోగులకు అంతర్గత సర్క్యులర్లు జారీ.
- చేపట్టిన పనులు రోజువారీగా పర్యవేక్షణ, నివేదికలు ఇచ్చేందుకు వార్డుల వారీగా అధికారుల నియామకం.
- స్వచ్ఛతపై ఇంటింటి ప్రచారం, అందుకు అవసరమయ్యే వాహనాలు, సిబ్బంది, సామగ్రి సమకూర్చుకోవడం
- వీధి వ్యాపారుల తాత్కాలిక కమిటీల ఏర్పాటు
- వ్యాపార, వాణిజ్య సముదాయాలను గుర్తించి నమోదు చేస్తారు.
- కొత్తగా స్వయం సహాయక సంఘాలఏర్పాటు
- ఇందిరా, మహిళా శక్తి మిషన కింద అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు ప్రణాళికల రూపకల్పన
- ఇందిరా, మహిళా శక్తి క్యాంటీన్ల ప్రారంభానికి కార్యాచరణ

బడిబాటతో విద్యార్థుల సంఖ్య పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి : బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమై జూన్ 6నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంపై సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విషయం, డిజిటల్ బోధన, సుశిక్షితులైె ఉపాధ్యాయులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, డీఎంహెచ్ఓ మనోహర్, సంక్షేమ అధికారులు నరసింహారావు, యాదయ్య, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6నుంచి 19వరకు బడిబాట

- 6వ తేదీన గ్రామసభల నిర్వహణ, ఆవాస ప్రాంతాల ప్రజలను భాగస్వామ్యం చేయటం.
- 7నుంచి 10వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, బడిబయటి పిల్లల గుర్తింపు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు, నమోదు పత్రాలు పంపిణీ
- 11న అన్ని వర్గాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్కూళ్లలో వసతులపై అవగాహన.
- 12న స్వాగత దినోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాలల దినోత్సవం, తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం
- 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ
- 16న ఎఫ్ఎల్ఎన్ దినోత్సవం, అభ్యసన అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ
- 17న ప్రత్యేక అవసరాల పిల్లల దినోత్సవం, బాలికా విద్యా దినోత్సవం
- 18న వనమహోత్సవం, డిజిటల్ విద్యా బోధన దినోత్సవం
- 19న ఆటపాటల దినోత్సవం

విత్తన ఎంపికే కీలకం

- హెచ్‌టీ కాటన్ సీడ్ వేయొద్దు
- మూసీ ఆయకట్టుకు కొత్త రకం వంగడాలు
- సరైన వర్షాలు కురిసిన తరువాతే విత్తనాలు వేయాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మధుశేఖర్
- పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు, సందేహాల నివృత్తి


సాక్షి, యాదాద్రి: పంట ఏదైనా విత్తన ఎంపికే కీలకం. నాణ్యత, చీడపీడలను తట్టుకునే గుణం కలిగి, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను ఎంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) గోపాల్ రైతులకు సూచించారు. గురువారం ‘సాక్షి’ ఫోన్ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మధుశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. పంటల సాగులో సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. విత్తనాల కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, లైసెన్స్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశంతో ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నాయని, ఇవి సాగుకు అనుకూలమే అయినప్పటికీ ఇప్పుడే విత్తనాలు విత్తవద్దన్నారు. భూమిలో వేడిమికి విత్తనాలు మాడిపోయే ప్రమాదం ఉందని, భారీ వర్షం కురిసిన తరువాత విత్తుకుంటే మంచిది. జూన్ 15 వరకు విత్తనాలు విత్తుకోవచ్చు.

ప్రశ్న : వరిలో కలుపు నివారణకు ఏ మందులు వేయాలి? – వేణుగోపాల్‌రెడ్డి, వంగాల

డీఏఓ : కలుపు నివారణకు ముందస్తుగా బుటాక్లోర్, బుటాక్లోర్, 2,4 డీఈఈ మిశ్రమం, అనిలోఫోస్ వాడాలి. కలుపు అధికంగా ఉన్నప్పుడు 2,4–డి సోడియం సాల్ట్ 80 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి మొక్కల నివారణకు సైహలోఫాప్ బుటైల్, వెడల్పు పత్రాలు కలిగిన కలుపు మొక్కల నివారణకు బిస్పైరిబాక్ సోడియం వాడవచ్చు.

ప్రశ్న: మూసీ ఆయకట్టులో తాలు, నూక ఎక్కువగా వస్తుంది. ఎలా అధిగమించాలి! –పక్కీర్ యాదవరెడ్డి, నర్సిరెడ్డి, మరికొందరు రైతులు, పోచంపల్లి మండలం

డీఏఓ: జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఆర్ఎన్ఆర్–29325, ఆర్ఎన్ఆర్ –28361, జేజీఎల్–28369 వంటి దొడ్డు రకం వరి వంగడాలను అభివృద్ధి చేసింది.ఇవి పొట్టిరకం విత్తనాలు. ఈ వంగడాలు సాగు చేస్తూ లాభసాటిగా ఉంటుంది. ఎకరాకు 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.



ప్రశ్న: వరిలో కొత్త రకం వంగడాలు వచ్చాయా? – పాండురెడ్డి, భూదాన్‌పోచంపల్లి

డీఏఓ: ఆర్ఎన్ఆర్ధన్ 75, భాగ్యనగర్ సోనా వంగడాలను ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్యాలయం రూపొందించింది. భాగ్యనగర్ సోనా మధ్యస్థ సన్నరకం వంగడాలకు మంచి డిమాండ్ ఉంది. ఎకరాకు 68 బస్తాల దిగుబడి వస్తుంది. ఇంకా మార్కెట్‌లోకి ఇంకా రాలేదు.

ప్రశ్న: హైబ్రిడ్ గ్రేడ్–ఏ, గ్రేడ్–బి వరి సాగు చేస్తాం. కొనుగోలు సమయంలో గ్రేడ్–బిగా పరిగణిస్తున్నారు. – నర్సిరెడ్డి, భూదాన్‌పోచంపల్లి

జవాబు: ఏ విత్తనం సాగు చేస్తే అదే రకం వస్తుంది. కోత సమయంలో వేర్వేరుగా నూర్పిడి చేయాలి.

ప్రశ్న: బీపీటీ విత్తనాలు ఎప్పుడు పోసుకోవాలి? – లింగయ్య, గుండాల


సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, పక్కన శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, మధుశేఖర్

డీఏఓ: బీపీటీ నారు పోసుకోవడానికి ప్రస్తుతం అనువైన సమయం.

ప్రశ్న: పెసర, పల్లి కిట్‌లు ఎప్పుడొస్తాయి? – వెంకటేశం, బ్రాహ్మణపల్లి

డీఏఓ: త్వరలో వచ్చే అవకాశం ఉంది. రాగానే రైతులకు సమాచారం ఇస్తాం.

ప్రశ్న: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదు ఇవ్వడం లేదు. – కొండల్, యాదగిరిగుట్ట

డీఏఓ: రశీదు ఇవ్వకుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలి. హెచ్‌టీ విత్తనాలు విక్రయించినా, రైతులు కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరం.

ప్రశ్న: నాణ్యమైన విత్తనాలు ఎక్కడ అందుబాటులో ఉంటాయి? – కొదారి వెంకటేశం, జిల్లా వినియోగ దారుల సంఘం అధ్యక్షుడు

డీఏఓ: లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలు లభిస్తాయి. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయవద్దని ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కుసుమ పంట వేయాలనుకుంటున్న. ఏ సీజన్‌లో సాగు చేయాలి. –పైళ్ల యాదిరెడ్డి, ముషిపట్ల

డీఏఓ: కుసుమ పంట రబీలో సాగు చేయాలి. చలి వాతావరణానికి మంచి దిగుబడి వస్తుంది. వానాకాలంలో కూడా వేయొచ్చు. అయితే చేలో నిరుల నిల్వ ఉండకుండా చూడాలి. ఎర్ర చెల్క నేలలు అనుకూలం.

ప్రశ్న: అల్లం సీడ్ ఎక్కడ దొరుకుతుంది, ఎలా సాగు చేయాలి? –సోమిరెడ్డి, సుద్దాల

డీఏఓ: జహీరాబాద్, నిజామాబాద్‌లో అల్లం కొమ్ములు లభిస్తాయి. భూమిని దున్నిన తర్వాత ముందుగా కాల్వల పొదలు చేయాలి. అరు నెలల పంటకాలం.

ప్రశ్న: పత్తిలో హైబ్రిడ్ రకాలు వస్తున్నాయి. ఏరకం సీడ్ వేయాలి? – భూదాన్‌పోచంపల్లి, రాజాపేట రైతులు

డీఏఓ: నిషేధిత హెచ్‌టీ పత్తి సీడ్ తప్పా ఏవైనా విత్తుకోవచ్చు. ముఖ్యంగా ఎల్‌బీనగర్ నుంచి తీసుకువచ్చే హెచ్‌టీకాటన్ విత్తనాలు ఎట్టి పరిస్థితిలో వేయొద్దు. లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద మాత్రమే సీడ్ కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా రశీదు పొంది పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి. దిగుబడి రాకపోతే పరిహారం పొందటానికి అవకాశం ఉంటుంది. ఆ సమయంలో రశీదు తప్పనిసరిగా చూపాల్సి ఉంటుంది. పత్తి విత్తనాలపై ప్రభుత్వ ఎలాంటి రాయితీ ఇవ్వలేదు.

ప్రశ్న: వేర్వేరు ప్రాంతాల్లో భూమి ఉంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ కావడం లేదు. – కొల్లోజు సోమనర్సింహాచారి, రామన్నపేట, సతీష్, మోత్కూరు

డీఏఓ: వివిధ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూములు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కావడం లేదని మా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక అందజేసాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. రైతు సంక్షేమ పథకాలు వర్తింపచేయడం కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రభుత్వం అమలు చేస్తుంది. ఇందులో నమోదైతేనే పథకాలు అందుతాయి. రైతులందరై ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తేవాలి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నాగులు (ఫైల్)

మేళ్లచెరువు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మేళ్లచెరువు మండల పరిధిలోని కందిబండ గ్రామ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన నాగులు(45) పని నిమిత్తం బైక్‌పై గురువారం మేళ్లచెరువుకు వస్తుండగా.. కందిబండ సమీపంలో గుర్తుతెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగులును స్థానికులు 108 వాహనంలో కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రహీనాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో..


అనిత (ఫైల్)

రామన్నపేట: ఇంట్లో సంపు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన గురువారం రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన అనిత(33)కు రామన్నపేటకు చెందిన జూకంటి మహేష్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. మహేష్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అనిత గురువారం ఉదయం ఇంట్లో నీటి సంపు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతురాలి భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడలోని పశువుల సంత నుంచి కొనుగోలు చేసిన ఐదు గోవులు, ఆరు ఎద్దులను ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. కోదాడకు చెందిన వాహన డ్రైవర్ షేక్ అఖీమ్, కొండ వీరకృష్ణ, కుంబజాడ సాయిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. పట్టుబడిన గోవులు, ఎద్దులను గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

మునగాలలో..

మునగాల: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం ఉదయం విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కోదాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనంలో రెండు ఎద్దులు, ఆరు ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించామన్నారు. కోదాడ పట్టణానికి చెందిన షేక్ ఖాజామోయినుద్దీన్, వాహన డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో విద్యావంతులు

పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సైతం కరువు పనికి..

డిగ్రీలు, పీజీలు చేసిన విద్యావంతులతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ ఖాళీ సమయాల్లో, మరికొందరు ఉన్నత ఉద్యోగాలు రాక పలుగు, పార పట్టుకుంటున్నారు. మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీలు సైతం లాభాపేక్ష లేకుండా రాజకీయాలు చేసి ఇప్పుడు కుటుంబ పోషణ కోసం ఉపాధి కూలీలుగా మారారు.

చదువుల ఖర్చు కోసం..


మచ్చ వాణి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన మచ్చ వాణి డీఎంఎల్‌టీ నర్సింగ్ పూర్తి చేసింది. ప్రస్తుతం గ్రామంలో జరిగే ఉపాధి పనులకు ప్రతిరోజు వెళ్తోంది. చదువుల ఖర్చు వెళ్లదీసుకోవడానికి ఉపాధి పనులకు వెళుతున్నట్లు ఆమె పేర్కొంది. ఖాళీ సమయాల్లో ఉపాధి పనులకు వెళ్లి ఆ తర్వాత చదువుకుంటున్నట్లు ఆమె చెప్పారు.

పీజీ ఎగ్జామ్‌కు సన్నద్ధమవుతూ..


తండు సైదులు

తిప్పర్తి: తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని నూకలవారిగూడేనికి చెందిన తండు సైదులు డిగ్రీ పూర్తిచేసి గ్రూప్స్‌కు పరీక్షలు రాశాడు. పీజీ చేసేందుకు సన్నద్ధమవుతూ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాడు. ఈ సీజన్‌లో వారం పాటు పనులకు వెళ్లాడు. గత సీజన్ మొత్తం ఉపాధి హామీ పనులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూనే..


మట్టిపల్లి సతీష్

అర్వపల్లి: ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూనే వేసవి సెలవుల్లో ప్రతిరోజు ఉపాధి పనికి వెళ్తున్నారు జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన మట్టిపల్లి సతీష్, ఎంఎస్సీ పూర్తిచేశారు. ఉదయం వేళ ఉపాధి పనికి వెళ్లి ఆ తర్వాత ఇతర పనులు చేసుకుంటానని సతీష్ పేర్కొన్నారు.

ఉద్యోగం రాక..


చేడె వెంకన్న

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లికి చెందిన చేడె వెంకన్న పీజీ(బీఏ లిటరేచర్) చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నించగా రాకపోవడంతో సొంత పనులతో పాటు ప్రతిరోజు ఉపాధి పనికి వెళ్తున్నారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగం రాలేదని బాధపడాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

పీజీ చదువుకొని..


మండల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లికి చెందిన మండల్‌రెడ్డి రవీందర్ రెడ్డి పీజీ పూర్తిచేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నించగా రాకపోవడంతో వ్యవసాయంతో పాటు ఖాళీ సమయాల్లో ఉపాధి పనికి వెళ్తున్నారు. ఈ పనికి వచ్చే డబ్బులతో ఇంట్లో ఖర్చులు వెళ్లదీస్తున్నట్లు ఆయన తెలిపారు.

బీఈడీ పూర్తిచేసి..


ఆరె విజయ్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లికి చెందిన ఆరె విజయ్ బీఈడీ చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూనే ఉపాధి పనికి వెళ్తున్నారు. ఉపాధి పనులు చేయడం ద్వారా వచ్చే డబ్బులతో కుటుంబం గడుస్తోందని ఆయన చెప్పారు.

నాడు ఎంపీపీ.. నేడు ఉపాధి కూలీ


యాతాకుల పున్నమ్మ

ఆత్మకూరు(ఎస్): మండల కేంద్రానికి చెందిన యాతాకుల పున్నమ్మ 2006 నుంచి 2011 వరకు ఎంపీపీగా పనిచేశారు. పదవిలో ఉన్నన్ని రోజులు ఆమె ఎలాంటి లాభాపేక్ష లేకుండా మండల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాటుపడింది. నేడు గ్రామంలో ఉపాధి పనులకు వెళ్తూ సాధారణ మహిళగా కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం గడుపుతోంది.

సర్పంచ్‌గా చేసి..


మాదగాని నాగమ్మ

అర్వపల్లి: 2014 నుంచి 2018 వరకు జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన మాదగాని నాగమ్మ సర్పంచ్‌గా పనిచేసింది. సర్పంచ్ పదవీకాలం పూర్తయినప్పటి నుంచి కుటుంబ పోషణ కోసం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్తోంది. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఉపాధి పనికి వెళ్లి కుటుంబం వెళ్లదీస్తున్నట్లు నాగమ్మ పేర్కొంది.

• పూల చెట్టు.. కిరాణ కొట్టు


భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన చిలువేరు లలిత కిరాణ కొట్టుపై విరబూసిన పూల చెట్టు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కిరాణం కొట్టుపై అలంకరించినట్లు ఎరుపు రంగు కాగితం పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. – భూదాన్‌పోచంపల్లి

గంజాయి సాగుచేస్తున్న నలుగురి అరెస్ట్

- 30 గంజాయి మొక్కలు, బైక్, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

పెద్దఅడిశర్లపల్లి: గంజాయి సాగుచేస్తున్న నలుగురు వ్యక్తులను గుడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో దేవరకొండ ఏఎస్పీ మౌనిక విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మట్టూరు గ్రామానికి చెందిన దెరగుంల సింగరావు కొండమల్లేపల్లిలో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామ శివారులో గల నాగిళ్ల పాండరయ్య వ్యవసాయ భూమిని పిల్లిగుంటతండాకు చెందిన ఇస్లావత్ చందూతో కలిసి సింగరావు కౌలుకు తీసుకున్నారు. పండ్ల వ్యాపారంలో భాగంగా సింగరావుకు నాంపల్లి మండలం బండతిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తగొల్ల శ్రీను పరిచయమయ్యాడు. సింగరావుకు శ్రీను కొన్ని గంజాయి విత్తనాలు ఇచ్చి వాటి మొక్కలుగా పెంచి ఇస్తే డబ్బులు ఇస్తానని చెప్పడంతో కౌలుకు తీసుకున్న భూమిలో సింగరావు గంజాయి విత్తనాలు నాటాడు. అవి మొక్కలుగా పెరిగిన తర్వాత శ్రీనుకు ఇచ్చాడు. శ్రీను రూ.5 వేలు సింగరావుకు ఇవ్వగా అందులో నుంచి రూ.2 వేలు చందూకు ఇచ్చాడు. శ్రీనుతో పాటు రేవల్లి గ్రామానికి చెందిన వంగూరి శివ కలిసి గంజాయి మొక్కలను అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఇదే క్రమంలో శ్రీను తిరిగి సింగరావుకు 30 గంజాయి విత్తనాలు ఇవ్వగా చందూతో కలిసి కౌలుకు తీసుకున్న భూమిలో నాటారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తన సిబ్బందితో కలిసి సింగరావు కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమిపై దాడి చేసి 30 గంజాయి మొక్కలు, బైక్, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. సింగరావుతో పాటు చందూ, శ్రీను, శివను అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ రాజు, గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, కొండమల్లేపల్లి ఎస్‌ఐ రమేష్, పోలీస్ సిబ్బంది గురువారెడ్డి, హట్టి, ఏడుకొండల్, రామకృష్ణ, శివ, మౌనిక, రవి, యాదగిరి, లింగయ్య, ఆనంద్‌ను ఏఎస్పీ అభినందించారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- రూ.2లక్షల నగదు, బైక్, 6 ఏటీఎం కార్డులు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: పెట్రోల్ బంకులను టార్గెట్‌గా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని నాగార్జునసాగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన అనాల శివ పెట్రోల్ బంకుల్లోకి వెళ్లి, తన బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని.. డబ్బులు అవసరం ఉన్నాయని చెప్పి తన ఏటీఎం కార్డుతో స్వైపింగ్ మిషన్ ద్వారా పెట్రోల్ బంకు అకౌంట్‌కు డబ్బులు పంపి నగదును తీసుకునేవాడు. ఈ తర్వాత స్వైపింగ్ కార్డు ద్వారా వైడ్ అనే ఆప్షన్‌తో తాను పంపిన డబ్బులను తిరిగి తన అకౌంట్‌కే పంపించుకునేవాడు. ఈ విధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా జిల్లాల్లో మోసాలకు పాల్పడ్డాడు. ఈ నెల 16వ తేదీన నాగార్జునసాగర్‌లో హైవే పక్కన ఉన్న భారత్ పెట్రోల్ బంక్‌కు వెళ్లి తనకు డబ్బులు అవసరం ఉన్నాయని స్వైపింగ్ చేసి డబ్బులు తీసుకుని తిరిగి స్వైపింగ్ ద్వారా వైడ్ అనే ఆప్షన్‌తో తన అకౌంట్‌కు డబ్బులు పంపించుకున్నాడు. ఈ మోసాన్ని గుర్తించిన బంకు యజమాని బొమ్మిడి బ్రహ్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐ బి. శ్రీనునాయక్ గురువారం నాగార్జునసాగర్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన అనాల శివ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అతడిని పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.2లక్షల నగదు, బైక్,, 6 ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నాగార్జునసాగర్ సీఐ బి. శ్రీనునాయక్, ఎస్‌ఐ ఎస్. సంపత్, కానిస్టేబుళ్లు రామకోటి, జావేద్, సురేష్, సతీష్, వెంకన్న, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిశువుల విక్రయం కేసు దర్యాప్తు ముమ్మరం

- మరింత లోతుగా విచారణ చేస్తున్న పోలీసులు
- ఇప్పటికే 13 మంది నిందితుల రిమాండ్
- ముఠా మూలాలు పలు రాష్ట్రాల్లో ఉన్నట్టు ప్రాథమిక సమాచారం

సూర్యాపేటటౌన్: శిశువుల విక్రయం కేసును పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సూర్యాపేటకు చెందిన దంపతులు ముఠాతో చేతులు కలిపి.. ఇతర రాష్ట్రాల నుంచి చిన్నారులను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ ముఠాకు సంబంధించిన అసలు మూలాలు అహ్మదాబాద్, ముంబైలో ఉన్నట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అసలు ఈ ముఠాలో ఇంకెంత మంది ఉన్నారనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు గురువారం సూర్యాపేటలో 13 మంది సభ్యులు గల శిశువుల విక్రయ ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 10 మంది చిన్నారులను విక్రయించినట్టు విచారణలో ఒప్పుకోగా.. ఆ పది మంది పిల్లలను తీసుకొచ్చి నల్లగొండ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. వీరు రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది పిల్లలను అమ్మినట్టు పోలీసుల విచారణలో తేలగా 10 మంది పిల్లలను తీసుకురాగా మరో 18మంది ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కోర్టులో హాజరు పరిచిన నిందితులను త్వరలో కస్టడీకి తీసుకొని విచారించనున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

ఎక్కడ నుంచి తీసుకొచ్చారు?

ఈ ముఠాలోని ఇద్దరు సూర్యాపేట వారు కాగా.. మిగతా 11మంది హైదరాబాద్, విజయవాడ, రాజస్థాన్‌కు చెందిన వారిగా గుర్తించారు. అహ్మదాబాద్, ముంబై నుంచి పిల్లలను తీసుకొచ్చి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు విక్రయిస్తున్నట్టు నిందితులు ఒప్పుకున్నారు. వీరు పిల్లలను ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారు.. ఆర్థిక స్థోమత లేని దంపతులకు డబ్బు ఆశ చూపి కొనుగోలు చేస్తున్నారా అనే విషయాన్ని కూడా సూర్యాపేట సీసీఎస్ పోలీసులు ఆరాతీస్తున్నారు.

నిందితులపై గతంలోనూ శిశు విక్రయ కేసులు

శిశు విక్రయ కేసులో పట్టుబడిన నిందితులపై గతంలోనూ శిశు విక్రయ కేసులు నమోదై ఉన్నాయి. ఏ6గా ఉన్న విజయవాడలోని గొల్లపూడికి చెందిన గరికముక్కు విజయలక్ష్మిపై గతంలో సూర్యాపేట జిల్లా మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, జనగామ జిల్లాలో ఒక కేసు, ఏలూరు వన్‌టౌన్‌లో ఒక కేసు, మంగళగిరిలో ఒకటి ఉంది. అలాగే ఏ8గా ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ముడావత్ రాజుపై మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, ముంబైలో మరో కేసు నమోదై ఉంది. ఏ9గా ఉన్న హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఐత శోభారాణిపై మేడిపల్లిలో ఒకటి, ముంబైలో ఒక కేసు నమోదై ఉంది. ఏ10గా ఉన్న రాజస్థాన్ రాష్ట్రం సోలంబర్‌కు చెందిన ఖాన్ షాహీనాపై ముంబైలో ఒక కేసు ఉంది. ఏ11గా ఉన్న తిరుమలగిరికి చెందిన ఎండి.షాహానాపై ముంబైలో ఒక కేసు ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సుధాకర్ (ఫైల్)

మాడ్గులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామానికి చెందిన బొప్పని సుధాకర్(42) హైదరాబాద్‌లో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం తోపుచర్ల నుంచి కుక్కడం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. కుక్కడం గ్రామ శివారులో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను స్థానికులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఈ నెల 19న హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మహేందర్ (ఫైల్)

మాడ్గులపల్లి, నల్లగొండ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తితో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం కొత్తగూడెం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడేనికి చెందిన రాయి మహేందర్ (21) ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెందిన మహేందర్ గురువారం కొత్తగూడెం గ్రామ శివారులో గుంటూరు నుంచి వికారాబాద్ వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించగా.. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ బి. రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి జారిపడి..

నల్లగొండ: నల్లగొండ-శ్రీరాంపురం రైల్వే స్టేషన్ల మధ్యన సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి గురువారం రైలు నుంచి జారిపడి మృతిచెందినట్లు రైల్వే ఎస్‌ఐ బి. రామకృష్ణ తెలిపారు. మృతుడు తెలుపు రంగు టీషర్టు, నీలం రంగు బనియన్, నలుపు రంగు నిక్కర్ ధరించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 8712658595 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి


ఘటనా స్థలంలో బాషి మృతదేహం

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండ గ్రామానికి చెందిన బూతం బాషి(30) గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాషి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెన్నకేశ్వరస్వామి దేవాలయంలో చోరీ


ఆలయంలో విచారణ జరుపుతున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో గల చెన్నకేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండ్ల రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చెన్నకేశ్వరస్వామి ఆలయం గేటుకు వేసిన తాళంతో పాటు గర్భగుడి తాళాలను పగులగొట్టి లోనికి వెళ్లి హుండీలోని నగదుకు ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయ సమీపంలోని ఓ రైతు పొలంలో పడేశారు. గురువారం ఉదయం కారింగు బాలయ్య గుడిని శుభ్రం చేసేందుకు వెళ్లగా.. ఆలయం గేటుకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఇన్‌చార్జి ఎస్‌ఐ జగన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. హుండీలో సుమారు రూ.50వేల నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇదే దేవాలయంలో గతంలో కూడా దొంగలు చోరీకి పాల్పడి అమ్మవారి మెడలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

గొర్రెలకు పొంచి ఉన్న చిటుకు వ్యాధి ముప్పు

- ముందస్తుగానే ఎంట్రో టాక్సీనియా టీకా వేయించాలి
- త్రిపురారం మండల పశువైద్యాధికారి నాగేందర్ సూచన



పాడిపంట

త్రిపురారం: గొర్రెలకు సోకే వ్యాధుల్లో చిటుకు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని నెత్తి పిడుగు, గడ్డి రోగం, పాటు రోగం వంటి పేర్లతో పిలుస్తుంటారు. గొర్రెలు తొలకరి వర్షాలకు మొలిచిన గడ్డిని ఎక్కువగా తినడం వల్ల చిటుకు వ్యాధి సోకుతుంది. బలిష్టంగా పెరిగి యుక్త వయసులో ఉన్న గొర్రెలు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మేత కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే గొర్రెల్లో ఈ వ్యాధి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు గొర్రెల పెంపకందారులు సకాలంలో జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చని త్రిపురారం మండల పశువైద్యాధికారి నాగేందర్ సూచిస్తున్నారు.

తొలకరిలో లేత గడ్డి తినడం వలన..

తొలకరి వర్షాలకు పొలాలు, గట్లపై పెరిగిన లేత గడ్డిని గొర్రెలు ఇష్టంగా తింటాయి. తద్వారా క్లాస్ట్రీడీయం పర్ ఫ్రిన్జర్స్ టైప్-డీ రకం సూక్ష్మజీవులు జీవాల పేగుల్లో గాలి లేని వాతావరణంలో అభివృద్ధి చెందుతాయి. ఈ సూక్ష్మజీవులు వదిలిన విష పదార్థాలు చిటుకు వ్యాధికి కారణమవుతాయి. మే నెల ఆఖరు నుంచి జూలై నెల మధ్యలో ఈ వ్యాధి ఎక్కువగా గొర్రెలకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు ఎగిరి కిందపడి కాళ్లు గిలగిల కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ బిగుసుపోయి ప్రాణాలు కోల్పోతాయి. వ్యాధి సోకిన జీవాలు మేత మేకపోవడం, నెమరు వేయకపోవడం, తలలు వాల్చి ముడుచుకొని ఒకే చోట నిలబడతాయి. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స చేయించాలి.

నివారణ మార్గాలు

జీవాలకు ప్రతి యేటా ఏప్రిల్, మే నెల మధ్యలో వ్యాధి నిరోధక టీకా (మల్టీకాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) తప్పనిసరిగా వేయించాలి. రెండో విడత అక్టోబర్, నవంబర్ నెలల్లో వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. తొలకరి వర్షాలకు మొలిచిన, వాడిపోయిన గడ్డిని జీవాలు మేయకుండా జాగ్రత్తలు పాటించాలి. గొర్రెలను ఉదయం కొంచెం ఆలస్యంగా మేతకు తీసుకెళ్లాలి. మధ్యాహ్నం చెట్ల కింద కాస్త విశ్రాంతి తీసుకునే విధంగా చూడాలి. సాయంత్రం ఎక్కువ సేపు పొలంలో ఉండకుండా దొడ్లలోకి తీసుకెళ్లాలి. వ్యాధి సోకిన గొర్రెలను మందలకు దూరంగా ఉంచాలి. ఇలాంటి జాగ్రత్తలతో చిటుకు వ్యాధి సోకకుండా చూసుకోవడంతో పాటు వ్యాధి బారిన పడిన జీవాలను కాపాడుకోవచ్చు.